క్లుప్తంగా

ఉర్దూ పాఠ్యపుస్తకాలను అందించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉర్దూ పాఠశాలలు తెరిచి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికి కొన్ని మండలాలకు ఉర్దూ పాఠ్యపుస్తకాలు అందలేదని రూట రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్‌హుస్సేన్, జుబేర్ అహ్మద్‌లు అన్నారు. ఈ విషయమై శనివారం డీఈఓ మీనాక్షిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నేటికీ కొన్ని పాఠశాలలకు పూర్తిస్థాయి పాఠ్య పుస్తకాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోపాటు అక్కడక్కడ సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. సంబంధింత సమస్యలను పరిష్కరించి ఉర్దూ విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సభలను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 16, 17, 18వ తేదీలలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ శంకర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా 20వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సమస్యలమయం అయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి తేజ, సహాయ కార్యదర్శి చంద్ర, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్‌ఫైజీలు కోరారు. ఈ విషయమై రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎండి ఫరూక్‌ను నంద్యాలలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం పదవ తరగతి విద్యార్థులకు సీఈడీఎం ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర కో ఆర్డినేటర్ మహమ్మద్ అయ్యుబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జికె కలీం, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైపుల్లా, అబ్దుల్ కలీం, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న బంగారు నాగయ్య యాదవ్

కడప కార్పొరేషన్/ కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రామరాజు పల్లె ప్రజలకు కోలాట ప్రదర్శనకు కావాల్సిన చీరలను పంపిణీ చేసినట్లు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రామరాజుపల్లిలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే కోలాట ప్రదర్శన కార్యక్రమానికి 35 మంది మహిళలకు అవసరమైన చీరలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ నగర అధ్యక్షుడు పాస్టర్ విజయ్ కిషోర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునెయ్య, నాయకులు వెంకటరమణ, వెంకటేశు, చంద్రగుప్త, నాగార్జున, జయంతి, బిందు, తులసి పాల్గొన్నారు.

పంచాయతీ వాటా చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలో నివాసేతర భవన నిర్మాణ అనుమతుల కోసం కడప పట్టణాభివృద్ధి సంస్థ ఫీజుల రూపంలో వసూలు చేసిన మొత్తంలో పంచాయతీకి రావాల్సిన వాటాను జమ చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు.

పార్లమెంట్ మార్చ్ జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నవంబర్ 28వ తేదీ ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, దీనిని జయప్రదం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు కోరారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్పీ నాయకులు నరసింహారావు, రాంచరణ్, అనిల్, అరవింద్ పాల్గొన్నారు.

కార్తీక పూజలకు వేళాయె..

శివ భక్తులకు అత్యంత ఇష్టమైన కార్తీక మాసం వచ్చేసింది. ఇందుకు తగినట్లుగా శివాలయాలలో ఈ మాసమంతా జరగాల్సిన పూజలకు ముందే ఏర్పాట్లు చేసుకోవడంతో ఆలయ ప్రాంగణాలన్నీ సందడిగా మారనున్నాయి. ఉదయం, సాయంత్రం విశేష పూజలు చేసేందుకు వస్తున్న భక్తులతో ఆలయాలు కళకళలాడతాయి. కడప నగరంలోని ప్రముఖ శివాలయాల గురించి సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.
- కడప కల్చరల్



గడ్డిబజారులోని శ్రీ సోమసుందరేశ్వర ఆలయం



మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం

శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం

ఇది జిల్లాలోగల అత్యంత పురాతన ఆలయం. దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం తర్వాత కొద్దిరోజులకే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. ఈ రెండు ఆలయాలకు ఒకే పుష్కరిణి ఉండడం ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. ఆలయ ప్రాంగణంలో శ్రీ గణపతి, శ్రీ సుబ్రమణేశ్వరస్వామి, నవగ్రహాలు, శమీవృక్షం ఉన్నాయి. విశాలమైన ప్రాంగణం ఉండడంతో కార్తీకమాసంలో భక్తులు ఈ ఆలయ ఆవరణంలో పెద్ద ఎత్తున దీపాలను వెలిగిస్తారు.

శ్రీ ప్రసన్న విశ్వేశ్వరాలయం

మోచంపేటలోగల ఈ ఆలయాన్ని కడప నగరం ఏర్పాటైన కొత్తలో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో తూర్పు ముఖుడైన స్వామికి ఉత్తర దిశన అమ్మవారిని దక్షిణ ముఖంగా ఏర్పాటు చేశారు. పాత ఆలయం శిథిలం కావడంతో రెండేళ్ల క్రితం నూతన ఆలయాన్ని అన్ని వసతులతో పునర్నిర్మించారు. ఆలయం నాలుగు వైపులా తగినంత ఖాళీ స్థలం ఉండడంతో భక్తులు విశేష సంఖ్యలో ఈ మాసమంతా ఉదయం, సాయంత్రం కార్తీక దీపాలను వెలిగిస్తారు.

శ్రీ సోమసుందరేశ్వరాలయం

వందేళ్ల చరిత్రగల ఈ ఆలయానికి నగరంలో ప్రముఖ శివాలయంగా పేరుంది. కార్తీకమాసంలో భక్తులు ఈ ఆలయానికి పెద్ద సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహిస్తారు. ప్రత్యేకమైన రోజున శివునికి అన్నాభిషేకం నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం సంధ్య, సాయం సంధ్యలలో ఈ ప్రాంగణమంతా భక్తులు వెలిగించే కార్తీక దీపాలతో నిండిపోతుంది. స్వామి ఆలయానికి ఉత్తరాన శ్రీ కళాంబదేవి కొలువై ఉన్నారు.

మృత్యుంజయేశ్వర ఆలయం

కడప నగరంలో కార్తీక మాసమంతా భక్తులతో కిటకిటలాడే ఆలయాలలో మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం ప్రముఖంగా నిలుస్తోంది. కార్తీకమాసమంతా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయంలో పూజలు చేస్తారు. ప్రత్యేకించి కార్తీక సోమ వారాల్లో ఉదయం 3 గంటల నుంచే భక్తులు శివయ్యను దర్శించుకుని పూజలు చేసేందుకు బారులు తీరుతారు. ప్రత్యేకించి ఆలయ ఆవరణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించేందుకు పోటీలు పడతారు. ఉదయం, సాయంత్రం కూడా కార్తీక దీపాల సందడి ఉంటుంది. ప్రస్తుతం ఆలయంలో ఎక్కువ మంది దీపాలు వెలిగించేందుకు అనుకూలంగా విశాలమైన వేదికను ఏర్పాటు చేశారు.

నబీకోట శివాలయం

కడప నగరంలో దక్షిణ దిశగా ఉన్న శివాలయాలలో నబీకోట శివాలయం ప్రముఖమైనది. ప్రాచీనమైన ఆలయంగా పేరుగాంచిన ఇందులో కార్తీకమాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతిసోమవారం ఉదయం, సాయంత్రం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించడంతోపాటు అక్కడి నాగుల విగ్రహాలకు కూడా భక్తులు పూజలు చేస్తారు. దాదాపు ప్రతిరోజు ప్రత్యేకమైన పూజలు ఈ ఆలయం ప్రత్యేకతగా చెప్పవచ్చు.

శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం

కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం కార్తీక మాసమంతా భక్తులతో సందడిగా ఉంటుంది. ఉదయం స్వామికి రుద్రాభిషేకాలు చేసినంతరం విశేష అలంకారం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రత్యేకించి ఈ మాసమంతా సాయంత్రం ఆలయ ప్రాంగణమంతా భక్తులు వెలిగించే కార్తీక దీపాలతో ధగధగలాడుతుంది.

ఆలయాలలో ఆకాశ దీపం

కడప కల్చరల్ : కార్తీక మాసం సందర్భంగా శివాలయాలన్నీ ప్రత్యేక పూజల కోసం సిద్ధమయ్యాయి. శనివారం ఆలయాలలో కార్తీక పూజలు నిర్వహించి ఈ పవిత్రమాసం ప్రారంభమైందని చాటుతూ ఆలయం ధ్వజ స్తంభంపై కార్తీక దీపాన్ని వెలిగించారు.

ఇందులో భాగంగా కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో కార్తీక మాసోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ప్రధాన అర్చకులు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. తొలుత దీపం వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా కార్తీక దీప పూజలు నిర్వహించారు.

మృత్యుంజయేశ్వరుని సన్నిధిలో....
నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం ఆలయ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చక బృందం పూజలు నిర్వహించి కార్తీక దీపాన్ని వెలిగించి ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు. అనంతరం మూల విరాట్‌కు విశేష పూజలు చేశారు. సోమవారం కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు అన్ని శివాలయాల్లో పూర్తి చేశారు.



విజయదుర్గమ్మ సన్నిధిలో కార్తీక దీపం వెలిగిస్తున్న భక్తులు

చట్టాలపై ప్రత్యేక అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: చట్టాలపై ప్రత్యేకమైన అవగాహన ప్రతి ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్‌లకు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు, లీగల్ సర్వీసెస్ సిబ్బందికి వుండాలనీ జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలియజేశారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో ఆయన అవగాహన కార్యక్రమంను నిర్వహించారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న చెన్నారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని పెన్షనర్లకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. డీపీఏ కార్యాలయంలో నవంబర్ నెల ఈసీ సమావేశం చెన్నారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర కూడా కీలకమైనదన్నారు. వారి సలహాలు ప్రభుత్వానికి చుక్కానిలా పని చేస్తాయని, వారిని చిన్న చూపు చూడటం ప్రభుత్వాలకు మంచిది కాదన్నారు. ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పెన్షనర్స్ భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, 2025 పెన్షనర్స్ డైరీ తదితరాల గురించి తెలియజేశారు. సంఘ అభ్యున్నతికి, భవననిర్మాణానికి తీసుకోవలసిన చర్యల గురించి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, అసోసియేట్ కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు వివరించారు. ఈ సందర్భంగా కార్యవర్గంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యక్ష పదవికి టి. నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా వెంకట సుబ్బారావు, మస్తాన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అపార్ నమోదులో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయడం తప్పని సరి అని ఈ విషయంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయడం తగదని డీఈఓ మీనాక్షి పేర్కొన్నారు. శనివారం కడప నగరం జయనగర్‌కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కడప ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు, ప్రిన్సిపల్స్‌కు, హెడ్మాస్టర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి అపార్ నమోదు తప్పనిసరి అన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయడం వల్ల విద్యార్థికి ఒక ధ్రువీకరణ నెంబర్ రావడం జరుగుతుందని తెలిపారు. దీంతో భవిష్యత్తు కాలంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఉన్నత చదువులకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో ప్రతి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తమ దగ్గర చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ నమోదు సోమవారం సాయంత్రం కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. అపార్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తే యాజమాన్యాలపై చర్యలకు వెనకాడనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సెల్ సిబ్బంది బ్రహ్మానంద రెడ్డి, జ్వాలాపతి, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన అపార్ నమోదు విషయంలో సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ మీనాక్షిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ నమోదు విషయంలో చాలా సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు సంబంధించిన రికార్డులలో పేర్ల నమోదు సరిగా లేని కారణంగా ప్రధానోపాధ్యాయులపై చాలా ఒత్తిడి పెరుగుతుందన్నారు. నమోదు సమయంలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.

పుస్తకానికి గౌరవం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆచార్యులు రహీ ఫిదాయి

కడప ఎడ్యుకేషన్: పుస్తకం ఏ భాషలో ఉన్నా గౌరవం, విలువ ఇవ్వాలని ప్రముఖ ఉర్దూ కవి, పరిశోధకులు, ఆచార్యులు డాక్టర్ రహీ ఫిదాయి అన్నారు. శనివారం వైవీయు ఆర్ట్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్‌లో ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో 'మీట్ ద ఆథర్' (రచయితను కలవండి) కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఫిదాయి ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ తెలుగు మాధ్యమంలో పాఠశాల విద్య పూర్తి చేసిన తాను తర్వాత ఉర్దూలో పుస్తక రచన చేశానన్నారు. అన్ని భాషలు సమానమేనని ఇష్టపడి నేర్చుకోవాలని సూచించారు. తరగతి గది, ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వాలన్నారు. డిగ్రీలు పొందడం కాదని, దాని ద్వారా జ్ఞానం సముపార్జించేలా మీ చదువులు సాగాలన్నారు. పరిశోధనలలో, పుస్తక రచనలో కాలంలోనిది కాపీ చేయడం కాకుండా, ఎవరూ రాయని కొత్త విషయాన్ని ప్రయత్నం చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో జరిగే సెమినార్లు స్థానిక వ్యక్తులు, పరిస్థితులను అంశాలుగా తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉర్దూ భాష గొప్పదనాన్ని వివరించారు. గౌరవ అతిథి, వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భాష ప్రాముఖ్యత, ఉర్దూ భాష ప్రత్యేకత గురించి వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఓడీ మెర్సీ విజేత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఉర్దూ శాఖ తరపున రహీ ఫిదాయిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ శాఖ విభాగాధిపతి రియాజున్నీసా, అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ ఎస్ ఖాజా పీర్, సర్దార్ ఖాజామైనుద్దీన్, డాక్టర్ నజీమున్నిసా, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, ఎం.రిహానా పర్వీన్ పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: అవినీతిని అంతం చేయడానికి యువత ముందుండాలని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా శనివారం కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల కల్తీని అరికట్టే విషయంలో, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. పన్నులు, రుసుం సక్రమంగా చెల్లించి ప్రభుత్వ ఆదాయ వనరులను పెంచడంలో విద్యార్థులు తమ కర్తవ్యాన్ని ఏ విధంగా నిర్వర్తించాలో దిశానిర్దేశం చేశారు. సాయంత్రం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులతో కడప స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, వైఎస్సార్ కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత భారతదేశం అందరి లక్ష్యం కావాలి
కడప ఎడ్యుకేషన్: అవినీతి రహిత భారతదేశం అందరి లక్ష్యమని, దాని కోసం అందరూ కృషి చేయాలని యోగివేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్, ఎంసీఏ విభాగ సహ ఆచార్యులు డా. కె.శ్రీనివాస రావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం యోగివేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవినీతి రహిత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించిచారు. అకడమిక్ కన్సల్టెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సి.ఎస్.టి. డాక్టర్ కృష్ణయ్య, జె.బి.వి.ఎస్. ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, సి.ఎస్.టి అకడమిక్ కన్సల్టెంట్లు శశి కుమార్, నారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ ఉపన్యాస పోటీలలో మొదటి బహుమతి రాముడు, రెండవ బహుమతి జాన్ మోసే, మూడో బహుమతి హారిక కైవసం చేసుకున్నారు.

కడప కేంద్ర కారాగారం ఆవరణలో ఖైదీ హల్‌చల్

కడప అర్బన్: కడప కేంద్రకారాగారం ఆవరణంలో రిమాండ్ నుంచి ఖైదీ శనివారం బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇంకా కేసులు వున్నాయనీ పోలీసులు బయటకు వచ్చీ రాగానే 'పీ టీ' వారెంట్‌పై తీసుకుని వెళ్లాలని ప్రయత్నించారు. ఈక్రమంలో ఆ ఖైదీ ఆవరణంలోని నీళ్ల ట్యాంక్‌ను ఎక్కి హంగామా చేశాడు. తరువాత ఎట్టకేలకు పోలీసులు పట్టుకుని తమ వెంట తీసుకుని వెళ్లారు.

పరారైన ఖైదీని పట్టుకున్న అధికారులు
కడప కేంద్ర కారాగారంలో ఓపెన్ ఎయిర్ జైలులో పనులు చేసుకుంటూ వున్న ఓ ఖైదీ మూడు రోజుల కిందట పరారయ్యాడు. అతన్ని జైలు అధికారులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

పోలీస్ వెల్ఫేర్ సొసైటీలో గోల్ మాల్
కడపలోని జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా 'పోలీస్ వెల్ఫేర్ సొసైటీ' నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో లోన్ల వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందని ఇటీవల కొన్ని రోజులుగా పోలీసు వర్గాలలో అలజడి రేగుతోంది. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి విచారణ చేపట్టినట్లు సమాచారం.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

కడప అర్బన్: జిల్లాలో మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలను తీసుకుంటామనీ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. గత వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 284 బెల్ట్ షాపులను గుర్తించి దాడులను చేశామన్నారు. 115 కేసులను నమోదు చేసి 371.1 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకుని 119 మందిని అరెస్ట్ చేశామన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాగితాలపెంటలో నివాసం వుంటున్న షేక్ కరీముల్లా తన భార్య షేక్ ఫిరదొసి(30)ను వేధింపులకు గురి చేయడంతో ఆమె మానసిక వేదన చెందింది. ఈనెల 1న ఇంటిలోనే చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాహీర్ హుసేన్ తెలియజేశారు.

అన్నదానం



కడప అర్బన్: కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం హిమవర్షిణి ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి 21వ వివాహ దినోత్సవం నిర్వహించుకున్నారు. వృద్ధులకు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రిటైర్డ్ ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, రెడ్డి లక్ష్మణ్, వెంకట సురేష్‌బాబు, దామోదర్, టైలర్ రవి, విజయ్, ఎలక్ట్రీషన్ మధు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యూ ట్యూబ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు యూట్యూబ్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కడప ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శాంతమ్మ సూచించారు. శనివారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు తెలుసుకుని బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పకుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రూతుమేరీ, ఉపాధ్యాయులు సరిత, స్వరాజ్యలక్ష్మి, శశిరేఖ, చంద్రకళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పనే లక్ష్యం



జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యం గా పోరాటాలు చేస్తామని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం డీవైఎఫ్‌ఐ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ల కు దారాదత్తం చేస్తున్నదన్నారు. ఏపీ కి హోదా అని చెప్పి టోపీ పెట్టిందన్నారు. ప్రధానంగా కడప ఉక్కు పరిశ్రమను విస్మరించిందన్నారు. రాబోవు రోజులలో కడప ఉక్కు సాధనే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కన్వీనర్ విజయ్, సమీర్, భాస్కర్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

దొరల గోరీల్లో ప్రార్థనలు



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కడప కల్చరల్ : కడప నగరం మాసాపేటలోని దొరల గోరీలలో శనివారం స్థానిక క్రైస్తవులు ఆల్‌సోల్స్ డేని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ పెద్దలను ఈ ప్రాంతంలో ఖననం చేసిన క్రైస్తవులు వారి సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు. తొలుత సమాధులను శుభ్రపరిచి పూలు, క్యాండిల్స్ తదితరాలతో అలంకరించారు. సాయంత్రం క్యాండిళ్లను వెలిగించి ప్రార్థనలు చేశారు. రెవరెండ్ డాక్టర్ బిషప్ కె.శ్యామూల్‌బాబు మాట్లాడుతూ మన దేశాన్ని పాలించిన బ్రిటీషు వారిలో కొందరు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు నచ్చడంతో ఇక్కడే స్థిరపడ్డారని, వారి సమాధులను ఇక్కడ నిర్మించడంతో యేటా సమాధుల దినం నాడు వారివారి పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు. పెద్దల ఆత్మలకు శాంతి చేకూర్చాలని దైవాన్ని వేడుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్‌లు విజయభాస్కర్, విక్టర్ రాజు, శాంతి స్వరూప్, జాన్ తిమోతి, వినోద్ మత్తయ్య, మోహన్‌రావు, స్థానిక సంఘాల కాపరులు, పెద్దలు పాల్గొన్నారు.

ప్రారంభమైన అయ్యప్పస్వామి పూజలు



హౌసింగ్‌బోర్డు రామాలయంలో భక్తుల పూజలు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో శనివారం నుంచి శ్రీ అయ్యప్పస్వామి పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ధ్వజంపై కాషాయ పతాకాన్ని భక్తులు ఎగురవేశారు. అనంతరం ఆలయంలో అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని నిలిపి పడిమెట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివునికి లఘు న్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఉభయదాతలచే అర్చకులు పలు పూజలను నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ మండలం రోజులపాటు ఆలయంలో ప్రతిరోజు అయ్యప్ప దీక్ష తీసుకునే వారికి గురుస్వామి మాల ధారణ చేస్తారని తెలిపారు. ప్రతిరోజు రాత్రి 7 నుంచి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ, భజనలు ఉంటాయని, భక్తులందరికీ భిక్షను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘన సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప, చిత్తూరు జిల్లాల కళాశాలల నూతన ఆర్జేడీగా ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన డి. గిరిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జి.సి.టి.ఏ) నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్. పత్తి వెంకట కృష్ణారెడ్డి, జి.సి.టి.ఏ అధ్యక్షులు డాక్టర్ శశికాంత్ రెడ్డిలు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్. నీలయ్య, ఆర్థిక కార్యదర్శి డాక్టర్. రామ కృష్ణ, సంఘ నాయకులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్. ఎం వి. సురేష్ బాబు పాల్గొన్నారు.